ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 28 జులై 2024 | 5

నేడు మంత్రుల పర్యటన

నిడదవోలు, జూలై 27 : నిడదవోలు మండలం వరద బాధిత ప్రాంతాల్లో ఆదివారం నలుగురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు.ఈ మేరకు బాధితులను పరామర్శించి ముంపు బారిన పడిన చేలను పరిశీలిస్తారు.ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం,కాల్దరి, నిడదవోలు మండలం తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో పర్యటిస్తారు. అక్కడ నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వెళ్లి సాయంత్రం 4 గంటలకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటారు. 5:30 గంటలకు సీతానగరం మండలంలోని రాపాక గ్రామంలో పర్యటిస్తారు. పర్యటనలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటారు.


వరద బాధితులకు నిత్యాసరాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

గోదారి దూకుడు


ఉరుకులు...పరుగులు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


ఇసుక వేటకు సెలవ్ : ఒడ్డుకు చేరిన ఇసుక పడవలు


ములకల్లంక వాసుల పడవ ప్రయాణం

మళ్లీ పోటెత్తిన గోదావరి

- గోదావరి ఉగ్రరూపం
- ఒక్కసారిగా వచ్చి పడిన వరద
- అంచనాలకు మించి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద నిండుగా గోదారి
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- 14.50 అడుగులకు నీటిమట్టం
- దిగువకు 13.92 లక్షల క్యూసెక్కులు
- నీట మునుగుతున్న లంకలు
- భయపెడుతున్న ఏటిగట్లు
- ఆందోళనలో ప్రజలు

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు : గోదావరి భయ పెడుతోంది.. తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరగడంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఆం దోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. గట్లను తాకుతూ లంకలను ముంచుతూ గోదావరి వరద ఉగ్ర రూపం దాల్చింది.గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఎగువ ప్రాంతాల్లో వాగులు, ప్రాజెక్టులు, ఉపనదులు పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరికి ఉపనదులు అయిన ప్రాణహిత,ఇంద్రావతి, పెన్‌గంగా, కిన్నెరసాని నదులతో పాటు సీలేరు, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.అదే విధంగా ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కుల వరద ప్రవాహం భారీగా నదిలోకి వచ్చి చేరుతుంది.దీంతో భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 12 గంటలకు నీటిమట్టం 53.90 అడుగులకు చేరింది. ఇప్పుడిప్పుడే తగ్గుముకం పడుతుందని చెబుతున్నారు.దిగువన కొవ్వూరు,రాజమహేంద్రవరంల మధ్య అఖండ గౌతమీ గోదావరికి భారీగా వరద పోటెత్తి మహోగ్రంగా మారింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 12 గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 14.50 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి దిగువకు 13,92, 833 క్యూసెక్కులు విడుదల చేస్తున్నా రు. పోలవరం స్పిల్‌వే నుంచి ఆదివారం ఉదయం 8 గంటలకు 12 లక్షల క్యూసెక్కుల వరకూ వరద ప్రవాహం ఉండవచ్చని అధికా రులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే లంకలన్నీ మునిగి పోయాయి.కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని మరో సారి ముంచెత్తింది. రాజమహేంద్రవరం, కొవ్వూ రులో స్నాన ఘట్టాలు పూర్తిగా నీటిమునిగాయి. గోదావరి మహోగ్రరూపం దాల్చడంతో నదీ తీరంలో సచివాలయ కార్యదర్శులు, పోలీసు సిబ్బందితో ప్రత్యే క బందోబస్తు ఏర్పాటుచేశారు. నదిలో ఎవ్వరు దిగకుండా చర్యలు చేపట్టారు. విజ్జేశ్వరం నుంచి పోలవరం వరకు ఉన్న ఏటిగట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఏజీఆర్‌బీ ఏఈ రేవు సునీల్‌బాబు తెలిపారు. నదీ ప్రవాహం ఉధృతంగా ఉన్నందున ఎవరు నదీలో దిగవద్దని, వేటకు వెళ్లరాదని హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.5 లక్షలు ప్రవాహం దాటిన దగ్గరి నుంచి నదిలో ఇసుక తవ్వకాలు నిలుపుదల చేశామన్నారు. నదిలో వడి ఎక్కువగా ఉన్నందున ఇసుక పడవుల నిర్వాహకులు నదిలోకి వెళ్లవద్దని సూచించారు. ఇదిలా ఉండగా లంకల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. సీతానగరం మండలం ములకల్లంక నుంచి ప్రజలు బయటకు రావడం లేదు. వారి అవసరాలకు బయటకు వచ్చి తిరిగి మళ్లీ ఊళ్లోకి వెళ్లిపోతున్నారు.వారి రాకపోకలకు అధికారులు రెండు పడ వలు ఏర్పాటు చేశారు. ఇంత ఉధృతంగా ఉన్నా వాళ్లు ఊరు వదిలి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. రా జ మహేంద్రవరంలోని లంకలలోని ప్రజలను ఇప్పటికే పునరా వాస కేంద్రాలలకు తరలించారు. మరింతగా వరద పెరుగు తుండడంతో కొవ్వూరు మండలం మద్దూరులంకలోకి నీరు వచ్చే అవకాశం ఉంది. అయినా బయటకు రావడంలేదు.


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఇలా..

మునిగిన లంకలు

పెరవలి, జూలై 27 : గోదావరి వరద తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతుండడంతో లంకలు నీట మునుగుతున్నాయి. పెరవలి మండల పరిధిలో కానూరు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, గ్రామాల పరిధిలో పలువురు రైతులు గోదావరి లంకభూములుపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. రెండు రోజులు కిందట గోదావరి తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే మళ్లీ గోదావరి పెరుగుతుండడంతో పంట భూములు నీట మునిగి పాడైపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని పల్లపు లంక భూముల్లోకి నీరు చేరింది. గోదావరి మరింత పెరిగితే మెరక భూముల్లోని తోటలు కూడా మునిగిపోతాయని ఆవేదన చెందుతున్నారు.


పెరవలిలో నీట మునిగిన పొలాలు

1421 కుటుంబాలకు సాయం

వివరాలు వెల్లడించిన కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో గోదావరి, ఎర్రకాలువ వరద బాధిత 1421 కుటుంబాలకు పునరావాస పరిహారం కింద నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు వంతున పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 529 మందికి ఒక్కొక్కరికి రూ. 3 వేల వంతున ఆర్థిక సహాయం చేశామన్నారు. నల్లజర్ల మండలంలో 40 కుటుంబాలు, రాజమండ్రి అర్బన్‌లో 163 కుటుంబాలు, బిక్కవోలు 5, గోకవరంలో 18, కడియంలో 4, కోరుకొండలో 20, రాజమండ్రి రూరల్‌లో 1,రంగంపేటలో 5, రాజానగ రంలో 9 , సీతానగరంలో 8 కుటుంబాలకు, చాగల్లులో 1, దేవ రపల్లిలో 11, గోపాలపురంలో 13, కొవ్వూరులో 37, నిడదవో లులో 1077 కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామన్నారు.ఇప్పటికే కొందరికి పంపిణీ చేసినట్టు చెప్పారు.రాజమండ్రి డివిజన్‌లో 233 కుటుంబాలు, కొవ్వూరు డివిజన్‌లో 1077 కుటుంబాలు లబ్దిపొందనున్నాయన్నారు.

కొవ్వూరులో 37 కుటుంబాలకు సాయం

కొవ్వూరు, జూలై 27 : వరద బాధితులకు సహాయం అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో వర్షాలకు ముంపునకు గురైన లేఅవుట్-3లో 37 మంది లబ్ధిదారులకు నిత్యావసరాలను శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. గత వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు కొవ్వూరు పట్టణంలో జగనన్న లేఅవుట్-3 కాలనీ ముంపుబారిన పడింద న్నారు.మోకాళ్లలోతు నీళ్లలో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలు నివసించడానికి వీలులేని పనికిరాని భూములను ఇళ్లస్థలాలుగా అందించిందన్నారు. ముంపు భూములు కాబట్టే వాడపల్లి, మద్దూరు, సీతంపేట గ్రామాల లబ్ధిదారులు ఇళ్లస్థలాలు తీసుకోవడానికి రాలేదన్నారు. అప్పులుచేసి ఇళ్లు కట్టుకున్నామని ఆనందం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి,కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, టి.వి.రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, దేగల రామ్‌కుమార్, పెరుగు పోతురాజు, రెవెన్యూ సిబ్బంది అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ పాలనతో ఆర్థిక సంక్షోభం

- గత ఐదేళ్లూ పడుకున్న అభివృద్ధి
- అటకెక్కిన పర్యాటక ప్రాజెక్టులు
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

కొవ్వూరు, జూలై 27 : గత వైసీపీ పాలనతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా పడుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు ప్రతిపక్ష పార్టీ నేతలను దూషించడానికి, వ్యక్తిగతంగా విమర్శించడానికే తప్ప రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. హేవ్‌లాక్ వంతెనను మల్టీపర్పస్ టూరిజం డెవలప్‌మెంటు కింద పట్టాలెక్కించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. పిచ్చుకలంకలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఒబెరాయ్ హోటల్ యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 2వ తేదీల్లో వారితో సంప్రదిస్తామన్నారు. కొవ్వూరు, భద్రాచలం పర్యాటక ప్రాజెక్టుకు గడచిన ఐదేళ్లలో ఒక ఇటుక పేర్చలేదన్నారు. గోష్పాదక్షేత్రం అభివృద్ధికి ప్రతిపాదనలు తయారుచేయవలసి ఉందన్నారు. కడియం నర్సరీలను చూడడానికి వచ్చే పర్యాటకులకు రిసార్ట్స్ ఏర్పాటు, పురాతన ఆలయాలను టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర పర్యాటక శాఖలో ఉన్న దర్శన్, ప్రసాద్ పథకాల ద్వారా నిధులు సేకరించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. తిరుపతి, వైజాగ్, విజయవాడ భవాని ఐలాండ్ అభివృద్ధికి త్వరలో ఒక ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల్లో ఒక్క రూపాయి లేకుండా ఖాళీ చేయడంతో ఇప్పటికిప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నామన్నారు. రాష్ట్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లించకుండా రూ.1600 కోట్లు బకాయి పెట్టారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.9 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి..కేవలం బటన్ నొక్కింది రూ.2 లక్షల కోట్లు పైచిలుకు మాత్రమే అన్నారు. కేవలం 2 లక్షల కోట్ల రూపాయలకు మాత్రమే ఖర్చు చూపించారన్నారు. మద్యం డబ్బంతా ఏం చేశారో తెలియదన్నారు. ఈ విధంగా రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టేశారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్లే ప్రతి బస్సు కొవ్వూరు డిపోకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నా రు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని,బోడపాటి ముత్యాలరావు,దేగల రాము, గంగుమళ్ళ స్వామి, ఎం.వెంకటేశ్వరరావు,బాబ్జి, కొప్పాక విజయకుమార్ పాల్గొన్నారు.

1న ఇంటికే పింఛన్లు

- పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
- రెండు రోజులే గడువు
- ఖాతాలకు చేరిన సొమ్ము

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జగన్ అసాధ్యం అన్నారు.. అయితే చంద్రబాబు మాత్రం సుసాధ్యం అని చేసి చూపించారు. గత నెలలో కేవలం రెండు రోజుల్లో ఇంటి వద్దనే పింఛన్లు అందించారు. ఈ నెలా అదే విధానాన్ని పాటించనున్నారు. జిల్లాలో ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదార్లకు ఇంటివద్దనే పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వృద్ధులు,వితంతులకు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల వంతున పింఛన్లు పంపిణీ చేయనున్నారు. గత ఏప్రిల్ నుంచే పింఛన్ల సొమ్ము పెంపు అమలు చేయడం వల్ల జూలైలో ఒక్కొక్కరికి రూ.7 వేల వంతున పింఛన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన జూలైలో సచివాలయ ఉద్యోగులు చాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులో 90 శాతంపైనే పంపిణీ చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల చేత పంపిణీకి ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం 2,40,595 మంది పింఛనుదారులు ఉన్నారు.వీరికి రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 లబ్ధిని చేకూర్చడానికి ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. తొలిరోజునే 99 శాతం పింఛన్లు పూర్తి చేయాలని.. ఏదైనా టెక్నికల్ సమస్య వస్తే మరుసటి రోజే అందించాలని ఆదేశించారన్నారు.

రెండు రోజులే పంపిణీ చేయండి : కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో ఆగస్టు 1నే పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పింఛన్ల పంపిణీపై ఆమె శనివారం సమీక్షించారు. ఆగస్టు 1న అందరూ ఉదయం 5 గంటల ముందే పింఛన్ల పం పిణీ ఆరంభించాలన్నారు. మొదటి రోజు 99 శాతం పంపిణీ పూర్తి చేయాలి..సాంకేతిక సమస్యలు తలెత్తితే రెండో రోజు పంపిణీ చేయాలని ఆదేశించారు.తర్వాత ఇక పొడిగింపు లేదన్నారు. సచివాలయాల వారీగా పెన్షన్ మొత్తాలు ఇప్పటికే ఎంపీడీవోలు,కమిషనర్లకు పంపించామన్నారు. వీటిని 30న సెక్రటేరియట్ బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తారని.. బ్యాంక్ మేనేజర్లకు నగదు ఆవశ్య కత లేఖను 29వతేదీ నా టికే అందించాలన్నారు. 31వ తేదీన మొత్తం సొమ్మును విత్‌డ్రా చేసుకో వాలని చెప్పారు.2వ తేదీకి చెల్లింపులు పూర్తి చేయాల న్నారు.చెల్లించని మొత్తాన్ని రెండు రోజుల లోపు సెర్ప్‌కి తిరిగి చెల్లించాలన్నారు. చెల్లించని పింఛన్లన్నింటికీ కారణాలను ఆయా సంక్షేమ సహాయకులు 5వ తేదీలోపు తెలియజేయాలన్నారు. గతంలో ఉపయోగించిన సిబ్బందినే ఉపయోగించుకోవాలని చెప్పారు.గత నెలలో మా దిరిగానే పింఛను లబ్ధిదారులకు పింఛన్ బట్వాడా రశీదు ఇస్తారన్నారు.

పింఛను లబ్ధిదారులు వీరే..

మండలం	లబ్ధిదారులు	పింఛను సొమ్ము
అనపర్తి	10,410	4,35,31,000
బిక్కవోలు	10,725	4,43,77,500
చాగల్లు	9452	4,00,74,000
దేవరపల్లి	11099	4,70,98,000
గోకవరం	10633	4,57,39,500
గోపాలపురం	9197	3,88,61,000
కడియం	12049	5,13,96,000
కోరుకొండ	12413	5,46,84,000
కొవ్వూరు	10245	4,32,77,500
కొవ్వూరు(అ)	3992	1,73,02,500
నల్లజర్ల	11591	4,90,65,000
నిడదవోలు	10546	4,51,49,000
నిడదవోలు(అ)	4313	1,89,31,000
పెరవలి	10406	4,38,17,500
రాజమండ్రి(అ)	29214	12,56,11,000
రాజమండ్రి(రూ)	19752	8,50,05,500
రాజానగరం	15500	6,68,26,000
రంగంపేట	8970	3,79,17,500
సీతానగరం	16,686	4,88,54,000
తాళ్ళపూడి	7917	3,33,09,000
ఉండ్రాజవరం	10479	4,46,53,000



గోదావరికి ఈ రోడ్డుకి సుమారు 5 కిలో మీటర్ల దూరం ఉంటుంది.. అయితే గోదావరి పొంగిందా ఈ ఆవ కాలువ నిండి ఆ కాలనీల్లో రోడ్లన్నీ చెరువుల్లా మారిపోతాయి. మళ్లీ గోదారి తగ్గే వరకూ ఇంతే. ఇదెక్కడో మారుమూల కాదండోయ్.. రాజమహేంద్రవరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సావిత్రినగర్‌లో దుస్థితి ఇది..

రాజమహేంద్రవరం మర్చిపోను
సీఎం సతీమణి నారా భువనేశ్వరి

కోరుకొండ, జూలై 27: రాజమహేంద్రవరంను ఎప్పటికీ మర్చిపోనని, రానున్న పుష్కరాల సమయంలో రాజమండ్రిలోనే ఉండి అన్ని కార్యక్రమాలు దగ్గరుండి నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు.రాజమహేంద్రవరం విచ్చేసి హైదరాబాద్‌కు వెళుతున్న ఆమెకు మధురపూడి విమానాశ్రయం వద్ద శనివారం సాయంత్రం బీజేపీ, టీడీపీ శ్రేణులు ఘనంగా వీడ్కోలు పలికారు. బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి, టీడీపీ నాయకులు పరిమి వాసు, భువనేశ్వరికి గోదావరి స్వీట్లు కిట్ అందజేశారు.

రూ.2 కోట్లు కొట్టేసి.. పోలీసులకు చిక్కాడు 7

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ తిలారి రవినాథ్ శనివారం జిల్లాకు విచ్చేసి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు.
- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)


గజ్జరం పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు, డీఈవో

అమ్మ పేరుతో మొక్క నాటండి : డీఈవో

తాళ్ళపూడి, జూలై 27 : అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పెంచాలని డీఈవో కె.వాసుదేవరావు పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తాళ్ళపూడి మండలం గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన ఎకో క్లబ్‌డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడానికి స్థలం లేకపోతే.. వీలున్న చోట మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కల పరిరక్షణ బాధ్యత విద్యార్థులదేనన్నారు. ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. క్లబ్‌లో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ఒక టీచరు కో ఆర్డినేటర్‌గా, ప్రైమరీ పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి పిల్లలు సభ్యులుగా, యూపి స్కూల్‌లో 5 నుంచి 8వ తరగతి విద్యార్థులు, ఉన్నత పాఠశాలల్లో 8,9 తరగతి పిల్లలు 20 నుంచి 50 మందికి తగ్గకుండా పిల్లలతో క్లబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాసరావు, ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి బాగుకు రూ.10 లక్షల విరాళం



కడియం, జూలై 27 : పుట్టిన ఊరుని.. కన్నతల్లిని మరవకూడద నేది పెద్దల మాట.. నేడు ఊరు దాటితే చాలు పుట్టిన ఊరు గురుతే ఉండడం లేదు. అటువంటిది తను పుట్టిన ఊరుకోసం ఏదో ఒకటి చేయాలనుకున్నాడు.. వాళ్లను..వీళ్లను సంప్రదించగా బడిలో చాలా సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు.. అంతే సమస్యలన్నీ తీరుస్తానని రంగంలోకి దిగారు. పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.10 లక్షలు ప్రకటించారు. పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. కడియం మండలం దుళ్ళ గ్రామానికి చెందిన యన్నమని లక్ష్మీనారాయణ (నర్సరీలక్ష్మీపతి) తన తల్లిదండ్రులు శ్రీరాములు-సావిత్రిల పేరిట తమ గ్రామంలో ఉన్న పాఠశాల అభివృద్ధికి రూ. 10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రహరీగోడ ఎత్తు చేయడం, పాఠశాల పేరు బోర్డును సిమెంట్ స్థంభాలతో పునః నిర్మాణం, కిచెన్‌షెడ్‌కు గోడల నిర్మాణం, బాలుర టాయిలెట్స్, బాలికల టాయలెట్స్ అభివృద్ధి, సైకిల్‌షెడ్ అభివృద్ధి, పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా మినీస్టేజ్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి,యన్నమని లక్ష్మీపతి, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

ఐటీడీఏ పీవోగా సింహాచలం

బాధ్యతల స్వీకరణ,,, సిటిజన్ ఎంగేజ్‌మెంట్ టీములు ఏర్పాటు చేస్తానని ప్రకటన

రంపచోడవరం, జూలై 27: రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కట్టా సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన సీతపల్లి శ్రీగడి బాపనమ్మ, ఐ.పోలవరం సమీపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా సిటిజన్ ఎంగేజ్ టీములు ఏర్పాటు చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా అధికారులు, సిబ్బందితో కలిసి ముందుకు సాగుతానన్నారు. పీవోకు ఏపీవో (జి) సీహెచ్ శ్రీనివాసరావు, పరిపాలనాధికారి డీఎస్వీ రమణ స్వాగతం పలికారు. డిప్యూటీ డైరెక్టర్ కె.అలూసలా, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఎస్‌వో టి.మార్తమ్మ తదితరులు పీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.


జగపతిబాబుకు మొక్క అందజేస్తున్న నర్సరీ రైతులు

పల్ల వెంకన్న నర్సరీలో జగపతిబాబు

కడియం, జూలై 27: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక పల్ల వెంకన్న నర్సరీని ప్రముఖ హీరో జగపతిబాబు శనివారం సందర్శించారు. ఆయనకు పల్ల వెంకన్న కుమారులు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి, మనుమలు వెంకటేష్, వినయ్ పీస్ లిల్లీ అనే మొక్క అందజేసి స్వాగతం పలికారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలను చూసి కొన్ని రకాల మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ పల్ల వెంకన్న నర్సరీతో తనకు ఏనాటి నుంచో అనుబంధం ఉందన్నారు. 'పెళ్ళైన కొత్తలో' చిత్రం షూటింగ్ చాలా వరకు ఈ నర్సరీలోనే జరిగిందని, పలు చిత్రాల షూటింగ్‌లకు కూడా వచ్చానని చెప్పారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.34.79 లక్షలు

ఆత్రేయపురం, జూలై 27: కోనసీమ తిరుమల వాడపల్లికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకుమజామునే సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి శ్రీవేంకటేశ్వర స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.34.79 లక్షలు లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలు బురదయమంగా మారడంతో వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది అయ్యింది. దీంతో రోడ్డుపక్కనే నిలుపుదల చేశారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

డీఎల్‌ఎంటీలకు ముగిసిన శిక్షణ

సామర్లకోట, జూలై 27: కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో 11 జిల్లాలకు చెంది డీఎల్‌ఎంటీలకు తొమ్మిది రోజులుగా ఇచ్చిన శిక్షణా తరగతులు శనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడు తూ శిక్షణను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేయడం ద్వారా పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మూడు బ్యాచ్‌లుగా వ్యవసాయ, విద్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు చెంది 255 మంది అధికారులు 11 జిల్లాల నుంచి పాల్గొన్నారని తెలిపారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నీహారిక, ఆంజనేయులు, చక్రపాణీరావు, పద్మజ పాల్గొన్నారు.


కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ఉరకలెత్తుతూ ప్రవహిస్తున్న గోదావరి

ఉగ్ర గోదావరి

» ధవళేశ్వరం వద్ద మరలా రెండో ప్రమాద హెచ్చరిక జారీ » 14.50 అడుగులకు చేరిన నీటిమట్టం » 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 27: గోదావరి పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ఉప నదుల నుంచి వస్తున్న వరద నీరు తోడవడంతో ఉగ్రరూపం దాల్చి ంది. సీజన్లో మొదటిసారిగా భద్రాచలం వద్ద 53 అడుగులకు పైగా ప్రవహిస్తుండగా ధవళేశ్వరం వద్ద 14 అడుగులకు చేరుకుని ప్రమాదకరంగా వుంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు స్వల్పంగా తగ్గిన నీటిమట్టం 13.40 అడుగులకు చేరుకుంది. అటుపై ఎగువ నుంచి వచ్చే వరద నీటితో నీటిమట్టం పెరగడం ప్రారంభించి మధ్యాహ్నం 3 గంటలకు 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 13లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఆపై నీటిమట్టం మరింత పెరుగుతూ రాత్రి 7 గంటలకు 14 అడుగులకు చేరుకోగా 13,20,274 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 15 అడుగులకు పైగా పెరిగి ఆపై తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరిగిన నీటిమట్టం ప్రమాదకర స్థాయి 53 అడుగులు దాటి రాత్రి ఏడు గంటలకు 53.60 అడుగులకు చేరింది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి 1.20లక్షలకు పైగా నీటిని విడుదల చేస్తుండడంతో ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద ప్రస్తుతం నీటిమట్టం పెరుగుతోంది.

ఎగువ నీటి మట్టాలు

శనివారం సాయంత్రానికి ఎగువున కాళేశ్వరం వద్ద 9.47 మీటర్లు, పేరూరు వద్ద 16.80 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.59 మీటర్లు, భద్రాచలం వద్ద 53.40 అడుగులు, కూనవరం వద్ద 21.48 మీటర్లు, కుంట వద్ద 13.15 మీటర్లు, పోలవరం వద్ద 13.26 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.08 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ధవళేశ్వరం వద్ద గోదావరికి శనివారం మధ్యాహ్నం 3గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం రాత్రి 12 గంటలకు 14.50 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కన్జర్వేటర్ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు ప్రమాద హెచ్చరిక జారీచేస్తూ ఫ్లడ్ సెక్షన్ అధికారులు వారికి కేటాయించిన ఏటిగట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈఈలు, డీఈలు, ఏఈలు, ఫ్లడ్ సూపరింటెండెంట్, ఫ్లడ్ సెక్షన్ ఆఫీసర్లుగా విధులు చేపట్టారు. బలహీన ఏటిగట్ల వద్ద, అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు.

ఎటుచూసినా వరద నీరే

గంటగంటకూ పెరుగుతున్న శబరి... ఉధృతంగా ప్రవహిస్తున్న సీలేరు.... ఎగువ పోటునిచ్చిన గోదావరి

చింతూరు, జూలై 27: ఎటు చూసినా వరద నీరే కనిపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం, ఎటపాక మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి వరద 53.3 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 42 అడుగులుగా నమోదైంది. డొంకరాయి రిజర్వాయరు నుంచి నాలుగు గేట్ల ద్వారా 13,124 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో సీలేరు నది ఉధృతమైంది. మొత్తం మీద విలీన మండలాల్లో వరద గంటగంటకూ పెరుగుతోంది. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి ఇప్పటికే వారం దాటింది. లోతట్టు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరద ఉధృతితో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద పెరుగుతున్నందున లోతట్టు వాసులందరూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు హెచ్చరిక జారీ చేశారు. దీంతో వారంతా సామగ్రి సర్దుకుని పరుగులు తీస్తున్నారు. గుట్టలు, మెట్టల్లో టార్పాలిన్లతో కూడిన పాకలు వేసుకుని తల దాచుకుంటున్నారు. చింతూరు మీదుగా విజయవాడ వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారితో పాటు ఒడిసా వెళ్లే 326వ నెంబరు జాతీయ నెంబరు రహదారి కూడా జలదిగ్బంధమైంది. దీంతో తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చింతూరు మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామాల్లో వరద నీరు భారీగా చేరడంతో గ్రామాల్లో నాటు పడవలపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం మండల కేంద్రాల్లోకి వరద నీరు చేరింది.


వీఆర్ పురం మండలం చింతరేగుపల్లి గ్రామాన్ని ముంచెత్తిన వరద నీరు

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, జూలై 27:

కాకినాడలో వికాస ఆధ్వర్యంలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ముత్తూట్ ఫిన్‌కాప్ లిమిటెడ్ కంపెనీలో సర్వీస్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, కెమిస్ట్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తర గతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటా యన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 నెంబరును సంప్రదించాలని లచ్చారావు కోరారు.

మహిళపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 27:

కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సరిహద్దు గోడ విషయంలో తగాదాలతో పట్టణంలోని రంగప్పచెరువు వీధికి చెందిన నేకూరి రాజ్యలక్ష్మిపై అదే ప్రాంతానికి చెందిన వేమగిరి రాజేష్ గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజేష్‌ను అరెస్టు చేసి దాడికి ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌ను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ జాన్‌బాషా తెలిపారు.


భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా....

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్ అధినేత సుధాకర్ శనివారం ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి హాజరయ్యారు. ఆమెను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన అల్లుడు అన్నె రామకృష్ణ, కుమార్తె అన్నె స్మిత, పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి ఆప్యాయంగా పలకరించారు.



12 గంటల్లో పట్టేశారు

రూ.2కోట్లు కొట్టేయడానికి యత్నించిన ఉద్యోగిని అరెస్టు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల్లో ఉంచాల్సిన డబ్బులతో ఉడాయించాలనుకున్న ఉద్యోగి ఆటకట్టించిన పోలీసులు 12 గంటల్లోనే కటకటాల్లోకి నెట్టారు. దీనికి సంబంధించి శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన వాసంశెట్టి అశోక్‌కుమార్ బ్యాంకు ఏటీఎంల్లో డబ్బులు నింపే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో 2018 నుంచి నెలకు రూ.11వేల జీతానికి సార్టర్ అసిస్టెంట్‌గా పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నాడు. ఈ సంస్థ హెడీఎఫ్‌సీ ఏటీఎంల్లో డబ్బులు నింపుతుంది. ఈ నెల 26వ తేదీ (శుక్రవారం) మధ్యాహ్నం సమయంలో ఏటీఎంల్లో పెట్టేందుకు బ్యాంకు నుంచి రూ.3,32,50,000 తీసుకున్నాడు. రూ.1.12 కోట్లను మరో ఉద్యోగి హరీశ్‌గౌడ్, ఆదిత్య, రూట్ ఆఫీసర్ దొంతల సునీల్‌కుమార్ (ఫిర్యాది)లకు ఇచ్చాడు. మిగతా రూ.2,20,50,000 వారం క్రితం వేసుకున్న పథకం ప్రకారం తాను అద్దెకు తెచ్చుకున్న కారులో పెట్టుకుని ఉడాయించాడు. దీనిపై మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజానగరం మండలం చక్రద్వారబంధం సమీపంలో అనుమానాస్పదంగా వ్యవహరించిన వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. కారులో రూ.లక్ష ఉండగా సదరు వ్యక్తిని నిందితుడు అశోక్‌కుమార్‌గా గుర్తించారు. అదే గ్రామంలో అద్దెకు తీసుకున్న రాకీ అవెన్యూస్ అపార్ట్‌మెంట్‌లోని గంగా బ్లాక్ ఫ్లాట్ నెం.104లో దోపిడీ డబ్బును దాచి... లక్ష మాత్రం తీసుకుని కొంతకాలం కనిపించకుండా ఉందామని అశోక్ చెప్పాడు. ఫ్లాట్‌లో దాచిన రూ.2,19,50,000 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చెడు వ్యసనాలకు, విలాస జీవనానికి అలవాటుపడి ఈ నేరానికి పాల్పడినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉన్నతాధికారుల సూచనలతో సాంకేతికత సహాయంతో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అనుసరించి నిందితుడిని కేవలం 12గంటల్లో అరెస్టు చేశారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ విజయపాల్, త్రీటౌన్ (వన్‌టౌన్ ఇన్చార్జి) సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్


నాలుగు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయానికి భారీగా వరద నీరు

మోతుగూడెం, జూలై 27: భారీగా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం నీటి విడుదలను 10,936 క్యూసెక్కులకు పెంచామని జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ఈ నెల 24 వరకు కురిసిన వర్షాలకు 1035.5 అడుగులకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమై నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే 26వ తేదీ నాటికి ఇక్కడ వరదనీరు మరింత చేరడంతో శుక్రవారం అర్ధరాత్రి 3వ గేటు (6వ నెంబరు గేటు) రెండు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా శనివారం ఉదయం నాటి జలాశయంలోకి ఇంకా ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో 4వ గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసి నీటిమట్టం 1036 అడుగుల వద్ద నీటి మట్టం స్థిరంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు శనివారం జలాశయం వద్దకు చేరుకుని ఇన్‌ఫ్లోస్, దిగువకు నీటిని విడుదల చేస్తున్న వివరాలను ఈఈ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జలాశయానికి వరద తాకిడి తగ్గేంత వరకు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి విడుదల, ఇన్‌ఫ్లోస్ సమాచారాన్ని అధికారులకు చెప్పాలని సూచించారు. ఈఈ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, చింతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. డొంకరాయిలోని ఏపీపీ డ్యామ్ కూడా వరద తాకిడి అధికం కావడంతో శనివారం రెండు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.


ఎటపాక-చెన్నంపేట గ్రామాల మధ్యలో రహదారిపై చేరిన వరద నీరు

గిరిజన గ్రామాలను ముంచెత్తిన వరద నీరు

ఎటపాక, జూలై 27: మండలంలోని గన్నవరం, గొల్లగూడెం, నందిగామ, ఎర్రగట్టు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. ఇళ్ల ఆవరణల్లోకి నీరు చేరడంతో బాధిత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో గత మూడు రోజులుగా ఈవైపు రాకపోకలు స్తంభించాయి. మురుమూరు, నందిగామ, గన్నవరం, నెల్లిపాక, రాయనపేట, గౌరిదేవిపేట, చోడవరం ఎటపాక ప్రధాన రహదారిను వరద నీరు ముంచెత్తింది. శనివారం ఉదయం భద్రాచలం- కూనవరంతో పాటు ఎటపాక-తెలంగాణ వైపుగా రాకపోకలు నిలిచాయి. విస్సాపురం పంచాయతీలోని ఎర్రగట్టు గిరిజన గ్రామంలో బోటుకు డిజిల్ ఏర్పాటు చేయకపోవడంతో గ్రామ సెక్రటరీ, ప్రజాప్రతినిధులు నడుము లోతు వరద నీటిలో వెళ్లి బాధితులకు కూరగాయలు అందించారు. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం ఉదయం వరద ప్రవాహంలో ప్రమాద అంచున భద్రాచలం వైపు వెళ్లింది. అందులోని ప్రయాణికులు ఒకింత భయాందోళన చెందారు.



రాయనపేట వద్ద వరద నీటిలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, ఎర్రగట్టులో వరద నీటిలో నిత్యావసరాలు తీసుకెళ్తున్న సెక్రటరీ, ప్రజాప్రతినిధి

శృంగార వల్లభస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.2.38 లక్షలు

పెద్దాపురం, జూలై 27: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు ఐదు వేల స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,56,590 అన్నదాన విరాళాలు రూ.48,281, కేశఖండన ద్వారా రూ.4,080, తులాభారం రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా 18,690, నామకరణం ద్వారా రూ.200... మొత్తం రూ.2,38,141 ఆదాయం సమకూరినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, జూలై 27: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. సెప్టెంబరు 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందినవారై, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి అంతరాయం లేకుండా చదువుతూ ఉండాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 45 కేంద్రాల్లో వచ్చే సంవత్సరం జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొందవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు.

ఏజెన్సీ సమాచారం



పోలీస్ స్టేషన్ ఎదురుగా రహదారిపై ఏర్పాటుచేసిన పడవ

మళ్లీ వరద ఉధృతి

కూనవరం, జూలై 27: గోదావరి తగ్గినట్టే తగ్గి మళ్లీ ఒక్కసారిగా ఉధృతమైంది. శుక్రవారం మధ్యాహ్నానికి తగ్గిన వరద అనంతరం క్రమక్రమంగా పెరిగింది. శనివారం ఉదయం మళ్లీ వరద నీరు వేగంగా గ్రామాల్లోకి ప్రవేశించింది. జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. మండలంలోని ప్రజలు కోతులగుట్ట పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. మొన్నటికంటే గోదావరి ఈసారి వేగంగా వచ్చింది. ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి రాకపోకలు తెగిపోయాయి. భద్రాచలం-కూనవరం మధ్య సంబంధాలు లేవు. మండల ప్రజలు వరద భయంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు వాన, మరోవైపు వరద వస్తుండడంతో మరికొన్ని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూనవరంలో శబరి-గోదావరి సంగమం వద్ద ప్రవాహం ఉధృతంగా ఉంది. 51 అడుగులతో ప్రమాద స్థాయిని దాటి గోదావరి ప్రవహిస్తోంది.

వరద ప్రవాహంలోనే మృతదేహం తరలింపు

శవాన్ని ఇంటికి చేర్చి మానవత్వం చాటుకున్న ఎటపాక సీఐ



కూనవరం, జూలై 27: ఎటపాక సీఐ డి.రామారావు మానవత్వం చాటారు. సుమారు మూడు గంటల పాటు మృతదేహం వెంటే ఉండి వరద ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా ఇంటికి చేర్చిన సంఘటన కూనవరం మండలంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా వున్నా యి... మండలంలోని టేకుబాక గ్రామానికి చెందిన ఆరవా నాగభూషణం (70) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో ముందుగా భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి చింతూరు ప్రభుత్వాస్పత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ నాగభూషణం చనిపోయాడు. కూనవరం మండలాన్ని గోదావర వరద చుట్టుముట్టడంతో బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని తీసుకురాలేక ఇబ్బందులు పడ్డారు. చింతూరు నుంచి కూనవరానికి మృతదేహాన్ని తరలించలేకపోయారు. దీంతో బంధువులు టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావుకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని ఆయన ఎటపాక సీఐ రామారావుకు వివరించారు. దీంతో చింతూరు నుంచి కూనవరం మండలంలోని పంద్రాజుపల్లి వరకు 108 అంబులెన్సులో మృతదేహాన్ని తీసుకొచ్చారు. అక్కడ రోడ్లపై వరద ప్రవాహం ఉండడంతో అప్పటికప్పుడు పడవలు ఏర్పాటు చేసే పరిస్థితి లేకపోకపోవడంతో సీఐ వెంటనే ట్రాక్టర్ రప్పించారు. వరద ప్రవాహంలోనే ట్రాక్టర్‌పై మృతదేహాన్ని తీసుకొచ్చారు. సీఐ మృతదేహాన్ని స్వయంగా మోసుకుని వచ్చి ట్రాక్టర్ ద్వారా ఒడ్డుకు చేర్చారు. అనంతరం సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని టేకుబాక గ్రామానికి తీసుకెళ్లి బంధువులకు అప్పగించారు. సీఐ రామారావు, టీడీపీ నాయకుడు భాస్కరరావుకు బంధువులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయండి

రాజవొమ్మంగి, జూలై 27: అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే శిరీషాదేవి సూచించారు. శనివారం ఆమె రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖ అధికారులతో సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు ప్రతి లబ్ధిదారుడికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలనే ప్రతిపాదనను ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. లాగరాయి ఆసుపత్రికి అంబులెన్స్ లేదని, పీహెచ్‌సీలకు ఇచ్చే మందులు సరిపోవట్లేదని, సిబ్బంది కొరతను రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి డాక్టర్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పెండింగ్ పనులను పూర్తి చేయలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. చాలా శాఖల అధికారులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చాలా గ్రామాల్లో పైపులైన్లు వేసి మరలా తీసి పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదన్నారు. డ్వాక్రా సంఘాల బుక్ కీపర్‌లలో కొంత మంది రాజకీయలు చేస్తున్నారని, వారు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తొలుత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తెలుగు యువత రంపచోడవరం నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సూరిబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

రాజవొమ్మంగి, జూలై 27: రంపచోడవరం నియోజకవర్గంలోని ముంపు గ్రామల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. శనివారం ఆమె స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారన్నారు. ముంపు గ్రామాల్లో అనేక మందికి వివిధ కారణాలతో రేషన్ కార్డులు లేకపోవడంతో కలెక్టర్ దృష్టికి వారి పరిస్థితి తీసుకెళ్లి వారికి కూడా అన్నీ అందేలా చూడాలని కోరామన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి రేషన్‌కార్డు లేనివారికి కూడా నిత్యావసరాలు అందేలా చర్యలు చేపట్టడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు.

అసెంబ్లీలో మాట్లాడ్డం చాలా ఆనందంగా ఉంది

మొదటిసారి అసెంబ్లీలో మాట్లాడ్డం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. మొదటి సమావేశం కావడంతో మాట్లాడేందుకు అనుమతి ఇస్తారని అనుకోలేదన్నారు. తక్కువ సమయం ఉన్నా సమస్యలను తెలియజేశానన్నారు. కొద్దిసేపటికే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి వరద ప్రభావిత బాధితులకు మూడు వేల రూపాయలు ఇవ్వాలని ఆదేశించడం ఆనందదాయకమన్నారు.

విద్యుత్ స్తంభాలపై పడిన భారీ వృక్షం

రంపచోడవరం, జూలై 27: రంపచోడవరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో 100 ఏళ్లనాటి భారీ వృక్షం శనివారం సాయంత్రం కూలిపోయింది. 33కేవీ విద్యుత్ లైన్ తెగిపోవడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం, మండలాల్లో దాదాపు 360 గ్రామాలకు సరఫరా నిలిచిపోయిందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. సరఫరా పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు చేపట్టారు.

డస్ట్‌బిన్లు పంపిణీ

దేవీపట్నం, జూలై 27: మండలంలోని ఇందుకూరు-1 మునునగుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో శనివారం ప్రతి ఇంటికీ డస్ట్ బిన్ పంపిణీ చేశారు. మండల విస్తరణాధికారి పీజీ రామకృష్ణ పర్యవేక్షణలో మూలపాడు, గానుగలుగుంది కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టి నిర్వహించి దోమల నియంత్రణకు యాంటీలార్వా ద్రావణం పిచికారీ చేశారు.

కంఠసర్పి, ధనుర్వాతం నిరోధక టీకాలు

సీతానగరం, జూలై 27: కంఠసర్పి, ధనుర్వాతం రాకుండా టీడీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పదేళ్ల వయసున్న పిల్లలు 472 మందికి ఈ వ్యాక్సిన్ వేశామన్నారు. దీని వల్ల అతి ప్రమాదకరమైన కంఠసర్పి, ధనుర్వాతం వ్యాధులు రాకుండా నిరోధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో యర్రా సుబ్బారాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

జగన్ నిర్వాకంతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం

- రూ.10 లక్షల కోట్లు పైబడి ఆర్థిక లోటు
- మాజీ సీఎం చేసినవన్నీ ఆర్థిక విధ్వంసాలే
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: గత ఐదేళ్లు జగన్ నిర్వాకం వల్ల రాష్ట్రం పూర్తిగా ఆర్థిక సంక్షోభంలో పడిందని, రూ.10 లక్షల కోట్లు పైబడి ఆర్థిక లోటు ఉందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అ న్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. విభాగాల వారీగా పరిశీలిస్తుంటే జగన్ రెడ్డి చేసిన అప్పులు, ఆర్థిక విధ్వంసాలు బయటకు వస్తున్నాయన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు సీఎం ఉన్నప్పుడు ఆర్థిక మిగులుతో తెలంగాణతో పోటీపడిన ఆంధ్రప్రదేశ్ జగన్ సీఎం అయ్యాక 2019-24 మధ్య ఆర్థిక విధ్వంసాలు, అప్పులు ఊబిలో కూరుకుపోయి కుదేలైందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు చాలా కష్టపడుతున్నారని చెప్పారు. ప్రతిపక్షహోదా కోసం హైకోర్టుకు వెళ్లిన జగన్ ఒకటి గుర్తుపెట్టుకోవాలని అతనికి ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 36 మంది హత్యకు గురయ్యారని దొంగ సాకు పెట్టి ఢిల్లీ వెళ్లి అక్కడ రాష్ట్రం పరువు తీశాడన్నారు. జిల్లాలో జరిగిన అవభూముల స్కామ్‌పై విచారణ కోరామని చెప్పారు. అవినీతికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బొమ్ములు దత్తు, యెనుముల రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

పునరావాస కేంద్రంలో సదుపాయాలపై ఆరా

స్థానిక చందాసత్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న బ్రిడ్జిలంక ప్రజలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి పరామర్శించారు. పునరావాస కేంద్రంలో అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వరద బాధితులుగా ఉన్న ప్రతి కుటుంబానికి రూ.3 వేలు నగదు, 25 కిలోల బియ్యం, లీటర్ ఆయిల్ ప్యాకెట్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళ దుంపలు, కిలో కందిపప్పు ఇచ్చినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సత్రం మాజీ చైర్మన్ యిన్నమూరి దీప, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, శెట్టి జగదీష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ సుభాషిణి
- పలుచోట్ల శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు



కడియం ఉన్నత పాఠశాలలో మొక్కను నాటుతున్న దృశ్యం

కడియం, జూలై 27: పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.సుభాషిణి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. కడియంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎకో క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వై.నాగేశ్వరరావు, ఎంఎస్ మణికుమార్, ఏఎల్ఎస్‌టీ కె.ఎస్తేరురాణి, గ్రీన్‌కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, జి.మణిదీప, పీడీ డేవిడ్ పాల్గొన్నారు. వేమగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో గుత్తుల కృష్ణ, యనమదల రాజు, కాంద్రేగుల సత్తిబాబు, హెచ్‌ఎం కె.జయరాజ్, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ మేడిశెట్టి అమల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని తోకాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంఈవో-1 రామన్నదొర, ఎంఈవో-2 జ్యోతిప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్‌లు ఏర్పాటుచేయాలని, విధిగా మొక్కలు నాటి వాటిని విద్యార్థులకు దత్తత ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని తల్లిదండ్రులను కుడా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక జడ్పీ హైస్కూల్లో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేసి అమ్మకోసం ఒక మొక్క పేరుతో వివిధ రకాలైన మొక్కలను క్లబ్ సభ్యులతో నాటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ప్రముఖ వైద్యుడు మల్లిడి కృష్ణారెడ్డి, పీఎంసీ సభ్యులు పీఎస్‌వీఎల్ నాగదేవి, యు.అంజనీకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మెళ్లూరు జడ్పీ స్కూల్లో హెచ్‌ఎం లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు.

కోరుకొండ: మండలంలోని అన్నిపాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అనే నినాదంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో టి.కుశలవదొర పాల్గొన్నారు.

రేపు శిక్షా సప్తాహ్ ముగింపు

దివాన్‌చెరువు, జూలై 27: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఈ నెల 29న ముగుస్తుందని ఎంఈవో జ్యోతిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లయిన సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిపాఠశాలలో ఈ విద్యావారం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం శుభతిథి భోజనాల కార్యక్రమం నిర్వహించడం ద్వారా ఈ శిక్షా సప్తాహ్ ముగుస్తుందన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూలై 27: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం అనపర్తిలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పెన్షనర్లు గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సమస్యలను అనపర్తి యూనిట్ అధ్యక్షుడు పీవీఎన్ సూర్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నల్లమిల్లి ప్రసంగిస్తూ గత ప్రభుత్వం అమలు కాని హామీలతో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిందని, అనేక విధాలుగా పెన్షనర్లు నష్టపోయారన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ముందుగా ఆర్థికేతర సమస్యలను, తదుపరి ఆర్థిక పరమైన పరిష్కరించే దిశగాను కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ముందుగా భవన ప్రాంగణంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మూర్తి, ఎస్‌టీవో దాక్షాయణి, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, పెన్షనర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాము డాక్టర్‌కు ఘన నివాళి

అనపర్తిలోని కేపీఆర్ పాఠశాల నిర్మాణకర్త, ప్రజా వైద్యుడు డాక్టర్ పోతంశెట్టి రామారెడ్డి(రాము డాక్టర్) జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన పాఠశాల వార్షికోత్సవానికి ఎమ్మెల్యే నల్లమిల్లి ముఖ్యఅతిథిగా విచ్చేసి రామారెడ్డి చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ప్రజా వైద్యుడిగా, షిర్డీసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా రాము చేసిన సేవలను కొనియాడారు. అభినందనీయమన్నారు. ఉత్తమ విద్యార్థులకు ట్రస్టు ద్వారా బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లిని, విద్యాదాత డాక్టర్ జానకిరామారెడ్డిలను సత్కరించారు. అలాగే ఐఐఐటీలో సీట్లు సాధించిన పలువురు విద్యార్థులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో కర్రి అప్పారావు (ఎర్రబ్బు), ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అనపర్తిలో ఎమ్మెల్యే నల్లమిల్లి, డాక్టర్ పోతంశెట్టిలను సత్కరిస్తున్న దృశ్యం

ఆదర్శప్రాయుడు కలామ్

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 27: మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండి యాగా గుర్తింపు పొందిన అబ్దుల్‌కలాంను యువత ఆదర్శంగా తీసుకోవా లని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి కోరారు. శనివారం భారతరత్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లోని విగ్రహానికి వారు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశాన్ని అగ్రరా జ్యాల సరసన నిలిపారని కొనియాడారు. కార్యక్రమంలో బి.రమాదేవి, మహే శ్వరి, సీహెచ్.ఫణికుమార్, ఎస్‌కే రెహమాన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్యాపురం నన్నయ మునిసిపల్ కార్పొరేషన్ జూనియర్ కాలేజీలో పీస్ ఫర్ పీపుల్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు.. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో లంక సత్యనారాయణ, గువ్వల వెంకటేశ్వరరావు, గుదే వెంకటేశ్వరరావు, చల్లగాలి వెంకట రాజరాజు, లక్కోజు వీరభద్రరావు, ఎస్పే నాయుడు, కడియాల వీరభద్రరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు జడ్పీ హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం పడాల ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కృషి, పట్టుదలతో అత్యున్నత స్థాయికి చేరిన కలాం జీవితం నేటి విద్యార్థి లోకానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

కోరుకొండ, జూలై 27: ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే సతీమణి వెంకటలక్ష్మి, తహశీల్దార్ రాజేశ్వరి, సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మద్దాల రమణ, బుద్దా బాపుజీ, మళ్ల అప్పల నర్సారావు, బదిరెడ్డి సత్యనారాయణమూర్తి, కామిశెట్టి దొరబాబు పాల్గొన్నారు. నర్సాపురంలో వరద బాధితులకు వీఆర్వో ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గోకవరం, జూలై 27: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ ప్రేమికుడు కొమెర అంకారావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆదర్శ పార్శశ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ మొక్కలు నాటి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలన్నారు. మానవ మనుగడకు ఆటంకంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రగళ్ళపాటి కనకరాజు, సెక్రటరీ పి.నాగమణి, కన్వీనర్ త్రినాథ్‌రావు, కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేగుళ్లమ్మకు బోనాల సమర్పణ



గోకవరం, జూలై 27: మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామదేవత వేగుళ్లమ్మ జాతర మూడు రోజులుగా వైభవంగా జరుగుతోంది. జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం మహిళలంతా అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని ఆడపడుచులు ఉదయం అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం బోనాలతో ఊరేగింపుగా గ్రామమంతా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

జీజీయూలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

రాజానగరం, జూలై 27: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో కాకినాడ గ్రూప్ ఎన్‌సీసీ 18 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణా శిబిరాన్ని కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ శనివారం సందర్శించి క్యాడెట్లు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిబిరం కమాండర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ ఈ శిబిరం వచ్చేనెల 3వ తేదీ వరకూ జరుగుతుందని, మూడు జిల్లాలకు చెందిన 591 మంది క్యాడెట్లు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో గైట్ అటానమస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్‌సీసీ ఏఎన్‌వో ఎ.తేజేశ్వరరాజు, పీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సేవలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 27: ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించే లక్ష్యంతో జిల్లా ఆర్టీసీ కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించినట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రాజమహేంద్రవరం-ఏలూరు, రాజమహేంద్రవరం-కాకినాడ నూతన సర్వీసులను ప్రారంభించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం త్వరలోనే అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారిణి షర్మిలా అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: జిల్లాలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూలు కౌంటర్లు ఆదివారం కూడా తెరచి ఉంటాయని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని విద్యుత్ కార్యాలయాల్లో ఆదివారం కౌంటర్లలో బిల్లులు కట్టించుకుంటారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మాత మధుసూదనరావుకు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 27: జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో శనివారం నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల మరిడయ్య, జిత్ మోహన్‌మిత్ర, గిరిజాల స్వామినాయుడు, నూజిళ్ళ సూరిబాబు, బి.సీతారామారావు, వి.జగపతి పాల్గొన్నారు. అలాగే ప్రముఖ జానపద, బుర్రకథ కళాకారుడు విభూతి బాబూరావు సంస్మరణ సభ శనివారం రూరల్ శాటిలైట్ సిటీ కళాకారుల కాలనీలో జరిగింది. ఆయన విగ్రహానికి రాజమండ్రి రూరల్ బీజేపీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ బాబూరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.సుబ్బారావు, వి.మోహనరావు, విభూతి బ్రదర్స్ లోవరాజు, శాంతారామ్, శివశంకర్, రఘురాం పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



రామకృష్ణనగర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, డాక్టర్ గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూలై 27: మండలంలోని హుక్కుంపేట పంచాయతీ పరిధిలోని రామకృష్ణనగర్ పరిసర ప్రాంతాల్లో కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజ్ఞప్తి మేరకు ఆమె శనివారం టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్ గోరంట్ల, పలువురు అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చేపట్టాల్సిన తక్షణ చర్యలపై పలు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, టీడీపీ మండలాధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ‘నీరుకొండ’



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న నీరుకొండ

కోరుకొండ, జూలై 27: జిల్లా కలెక్టర్ ప్రశాంతిని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బూరుగుపూడి ఆవభూముల సమస్యలు వివరించి వరద బాధిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది వరదలకు బురద కాలువ పొంగడం వల్ల సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన కొన్ని గ్రామాలు ఇబ్బందులకు గురవుతున్నాయని, వేలాది ఎకరాల్లో పంట నష్టపోతుందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు.

గోరంట్ల అధికారిక పీఏగా డీటీ నాగేంద్రబాబు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 27: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారిక పీఏగా ఆర్ఎస్‌వీ నాగేంద్రబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం నాగేంద్రబాబు గోరంట్లను కలిసి బాధ్యతలు స్వీకరించారు. నాగేంద్రబాబు డిప్యూటీ తహశీల్దార్(డీటీ)గా పనిచేస్తూ ఎమ్మెల్యే పీఏగా నియమితులయ్యారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం, జూలై 27: గోదావరి వరదల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. శనివారం వారి ద్దరూ మండలంలోని ములకల్లంక, బొబ్బిల్లంక, జాలిమూడి గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను, బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వలవల రాజా, పోలిన కృష్ణ, పెండ్యాల అవిస్వామి, చిట్టూరి రంగారావు, మట్ట వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు

చినకొండేపూడిలో ఎరువులు సీజ్

సీతానగరం, జూలై 27: మండలంలోని చినకొండేపూడిలో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువులను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన సిద్ధి వినాయక ఎంటర్ ప్రైజస్ ఎరువులు, పురుగు మందుల షాపులో వ్యవసాయ శాఖ అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 20.20.0.13 ఎరువులను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎ.జగన్నాథరెడ్డి సీజ్ చేశారు. నిల్వ ఉంచిన సరుకు విలువ రూ.72,090 ఉంటుందన్నారు. రికార్డుల్లో చూపిన నిల్వలకు, వాస్తవ నిల్వలకు వ్యత్యాసముందని, దీంతో డీలర్‌పై ఈసీ యాక్టు 1955, 6ఏ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

అమరావతికి కేంద్రమిచ్చింది గ్రాంట్ కాదు

పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: కేంద్ర బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతికి ఇచ్చింది అప్పు అని అది గ్రాంట్ కాదని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. రాజమహేంద్రవరం పేపరుమిల్లు గేటు ఎదురుగా శ్రీకృష్ణ సాయి కల్యాణ మండపంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ1.5 వేల కోట్లు కేటాయిస్తే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో సహా కూటమి నేతలంతా సంబరాలు చేసుకుంటున్నారని, కాని కేంద్రమిచ్చింది అప్పుమాత్రమేనన్నారు. బిహార్ రాష్ట్రం ప్రత్యేక హోదా అడుగుతుంటే ఏపీ మాత్రం ప్రత్యేక హోదా ఊసేలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సిటీ ఇన్‌చార్జి బోడా వెంకట్, టీకే విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్, మార్టిన్ లూథర్, కిశోర్ జైన్, చింతాడ వెంకటేశ్వరరావు, బత్తిన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

‘సేవల ఆలస్యానికి కారణాలపై బోర్డు పెట్టండి’

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: నగరపాలక సంస్థలో జనన-మరణ నమోదు విభాగంలో సేవలు ఆలస్యానికి కారణాలు ప్రజలు తెలిసేవిధంగా బోర్డు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో శనివారం జనన-మరణ నమోదు విభాగం వద్ద పెద్దఎత్తున ప్రజలు క్యూ ఉండడాన్ని,చంటి పిల్లలతో తల్లులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఈ మేరకు ఆ విభాగంలోకి వెళ్లి అధికారులతో మాట్లాడారు. సర్వర్లు ఆలస్యంగా పనిచేయడంతో ఇబ్బంది అవుతుందని ఎమ్మెల్యేకు తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: రాయన్
సూర్యామినీ	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
సూర్యాప్యాలస్	: రాయన్
స్వామి	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
శివజ్యోతి	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: డార్లింగ్
రాజా	: -----
ఊర్వశి	: భారతీయుడు-2
రంభ	: పురుషోత్తముడు
మేనక	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అప్సర	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కుమారి	: ఆపరేషన్ రావణ్
అశోక	: కల్కీ
వీఎస్ మహాల్(నామవరం)	: రాయన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కల్కి
వెంకటసూర్య(కడియం)	: రాయన్
సత్యగౌరి (అనపర్తి)	: భారతీయుడు-2
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: రాయన్
రామకృష్ణ(కోరుకొండ)	: భారతీయుడు-2
గీతాసినిమాస్ (సీతానగరం)	: రాయన్
శ్రీనివాస (గోకవరం)	: రాయన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహల్(రంపచోడవరం)	: రాయన్
నవయుగ(చింతూరు)	: -----



ఉరుకులు..పరుగులు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

గోదారి దూకుడు

మళ్లీ పోటెత్తిన గోదావరి



ఇసుక వేటకు సెలవ్ : ఒడ్డుకు చేరిన ఇసుక పడవలు



ములకల్లంక వాసుల పడవ ప్రయాణం

- గోదావరి ఉగ్రరూపం
- ఒక్కసారిగా వచ్చి పడిన వరద
- అంచనాలకు మించి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద నిండుగా గోదారి
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- 14.20 అడుగులకు నీటిమట్టం
- దిగువకు 13.46 లక్షల క్యూసెక్కులు
- నీట మునుగుతున్న లంకలు
- భయపెడుతున్న ఏటిగట్లు
- ఆందోళనలో ప్రజలు

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు : గోదావరి భయ పెడుతోంది.. తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరగడంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. గట్లను తాకుతూ లంకలను ముంచుతూ గోదావరి వరద ఉగ్రరూపం దాల్చింది.గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఎగువ ప్రాంతాల్లో వాగులు, ప్రాజెక్టులు, ఉపనదులు పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరికి ఉపనదులు అయిన ప్రాణహిత,ఇంద్రావతి, పెన్‌గంగా, కిన్నెరసాని నదులతో పాటు సీలేరు, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అదే విధంగా ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కుల వరద ప్రవాహం భారీగా నదిలోకి వచ్చి చేరుతుంది. దీంతో భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 9 గంటలకు నీటిమట్టం 53.80 అడుగులకు చేరింది. మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు.దిగువన కొవ్వూరు, రాజమహేంద్రవరంల మధ్య అఖండ గౌతమీ గోదావరికి భారీగా వరద పోటెత్తి మహోగ్రంగా మారింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 9 గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 14.20 అడుగులకు చేరింది.బ్యారేజీ నుంచి దిగువకు 13,46,507 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోలవరం స్పిల్‌వే నుంచి ఆదివారం ఉదయం 8 గంటలకు 12 లక్షల క్యూసెక్కుల వరకూ వరద ప్రవాహం ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తు న్నారు. ఇప్పటికే లంకలన్నీ మునిగిపోయాయి. కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని మరోసారి ముంచెత్తింది. రాజమహేంద్రవరం, కొవ్వూరులో స్నానఘట్టాలు పూర్తిగా నీటిమునిగాయి. గోదావరి మహోగ్రరూపం దాల్చడంతో నదీ తీరంలో సచివాలయ కార్యదర్శులు, పోలీసు సిబ్బందితో ప్రత్యే క బందోబస్తు ఏర్పాటుచేశారు. నదిలో ఎవ్వరు దిగకుండా చర్యలు చేపట్టారు. విజ్జేశ్వరం నుంచి పోలవరం వరకు ఉన్న ఏటిగట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఏజీఆర్‌బీ ఏఈ రేవు సునీల్‌బాబు తెలిపారు. నదీ ప్రవాహం ఉధృతంగా ఉన్నందున ఎవరు నదీలో దిగవద్దని, వేటకు వెళ్లరాదని హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.5 లక్షలు ప్రవాహం దాటిన దగ్గరి నుంచి నదిలో ఇసుక తవ్వకాలు నిలుపుదల చేశామన్నారు. నదిలో వడి ఎక్కువగా ఉన్నందున ఇసుక పడవుల నిర్వాహకులు నదిలోకి వెళ్లవద్దని సూచించారు. ఇదిలా ఉండగా లంకల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. సీతానగరం మండలం ములకల్లంక నుంచి ప్రజలు బయటకు రావడం లేదు. వారి అవసరాలకు బయటకు వచ్చి తిరిగి మళ్లీ ఊళ్లోకి వెళ్లిపోతున్నారు.వారి రాకపోకలకు అధికారులు రెండు పడవలు ఏర్పాటు చేశారు. ఇంత ఉధృతంగా ఉన్నా వాళ్లు ఊరు వదిలి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరంలోని లంకలలోని ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలలకు తరలించారు. మరింతగా వరద పెరుగుతుండడంతో కొవ్వూరు మండలం మద్దూరులంకలోకి నీరు వచ్చే అవకాశం ఉంది. అయినా బయటకు రావడంలేదు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఇలా...

మునిగిన లంకలు

పెరవలి, జూలై 27 : గోదావరి వరద తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతుండడంతో లంకలు నీట మునుగుతున్నాయి. పెరవలి మండల పరిధిలో కానూరు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, గ్రామాల పరిధిలో పలువురు రైతులు గోదావరి లంకభూములుపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. రెండు రోజులు కిందట గోదావరి తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే మళ్లీ గోదావరి పెరుగుతుండడంతో పంట భూములు నీట మునిగి పాడైపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని పల్లపు లంక భూముల్లోకి నీరు చేరింది. గోదావరి మరింత పెరిగితే మెరక భూముల్లోని తోటలు కూడా మునిగిపోతాయని ఆవేదన చెందుతున్నారు.



పెరవలిలో నీట మునిగిన పొలాలు

నేడు మంత్రుల పర్యటన

నిడదవోలు, జూలై 27 : నిడదవోలు మండలం వరద బాధిత ప్రాంతాల్లో ఆదివారం నలుగురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు.ఈ మేరకు బాధితులను పరామర్శించి ముంపు బారిన పడిన చేలను పరిశీలిస్తారు.ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం,కాల్దరి, నిడదవోలు మండలం తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో పర్యటిస్తారు. అక్కడ నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వెళ్లి సాయంత్రం 4 గంటలకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటారు. 5:30 గంటలకు సీతానగరం మండలంలోని రాపాక గ్రామంలో పర్యటిస్తారు. పర్యటనలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటారు.



వరద బాధితులకు నిత్యాసరాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

1421 కుటుంబాలకు సాయం

వివరాలు వెల్లడించిన కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో గోదావరి, ఎర్రకాలువ వరద బాధిత 1421 కుటుంబాలకు పునరావాస పరిహారం కింద నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు వంతున పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 529 మందికి ఒక్కొక్కరికి రూ. 3 వేల వంతున ఆర్థిక సహాయం చేశామన్నారు. నల్లజర్ల మండలంలో 40 కుటుంబాలు, రాజమండ్రి అర్బన్‌లో 163 కుటుంబాలు, బిక్కవోలు 5, గోకవరంలో 18, కడియంలో 4, కోరుకొండలో 20, రాజమండ్రి రూరల్‌లో 1,రంగంపేటలో 5, రాజానగ రంలో 9 , సీతానగరంలో 8 కుటుంబాలకు, చాగల్లులో 1, దేవ రపల్లిలో 11, గోపాలపురంలో 13, కొవ్వూరులో 37, నిడదవో లులో 1077 కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామన్నారు.ఇప్పటికే కొందరికి పంపిణీ చేసినట్టు చెప్పారు.రాజమండ్రి డివిజన్‌లో 233 కుటుంబాలు, కొవ్వూరు డివిజన్‌లో 1077 కుటుంబాలు లబ్ధిపొందనున్నాయన్నారు.

కొవ్వూరులో 37 కుటుంబాలకు సాయం

కొవ్వూరు, జూలై 27 : వరద బాధితులకు సహాయం అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో వర్షాలకు ముంపునకు గురైన లేఅవుట్-3లో 37 మంది లబ్ధిదారులకు నిత్యావసరాలను శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. గత వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు కొవ్వూరు పట్టణంలో జగనన్న లేఅవుట్-3 కాలనీ ముంపుబారిన పడింద న్నారు.మోకాళ్లలోతు నీళ్లలో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలు నివసించడానికి వీలులేని పనికిరాని భూములను ఇళ్ళస్థలాలుగా అందించిందన్నారు. ముంపు భూములు కాబట్టే వాడపల్లి, మద్దూరు, సీతంపేట గ్రామాల లబ్ధిదారులు ఇళ్లస్థలాలు తీసుకోవడానికి రాలేదన్నారు. అప్పులుచేసి ఇళ్లు కట్టుకున్నామని ఆనందం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి,కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, టి.వి.రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, దేగల రామ్‌కుమార్, పెరుగు పోతురాజు, రెవెన్యూ సిబ్బంది అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ పాలనతో ఆర్థిక సంక్షోభం

- గత ఐదేళ్లూ పడుకున్న అభివృద్ధి
- అటకెక్కిన పర్యాటక ప్రాజెక్టులు
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

కొవ్వూరు, జూలై 27 : గత వైసీపీ పాలనతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా పడుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు ప్రతిపక్ష పార్టీ నేతలను దూషించడానికి, వ్యక్తిగతంగా విమర్శించడానికే తప్ప రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. హేవ్‌లాక్ వంతెనను మల్టీపర్పస్ టూరిజం డెవలప్‌మెంటు కింద పట్టాలెక్కించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. పిచ్చుకలంకలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఒబెరాయ్ హోటల్ యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 2వ తేదీల్లో వారితో సంప్రదిస్తామన్నారు. కొవ్వూరు, భద్రాచలం పర్యాటక ప్రాజెక్టుకు గడచిన ఐదేళ్లలో ఒక ఇటుక పేర్చలేదన్నారు. గోష్పాదక్షేత్రం అభివృద్ధికి ప్రతిపాదనలు తయారుచేయవలసి ఉందన్నారు. కడియం నర్సరీలను చూడడానికి వచ్చే పర్యాటకులకు రిసార్ట్స్ ఏర్పాటు, పురాతన ఆలయాలను టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర పర్యాటక శాఖలో ఉన్న దర్శన్, ప్రసాద్ పథకాల ద్వారా నిధులు సేకరించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. తిరుపతి, వైజాగ్, విజయవాడ భవాని ఐలాండ్ అభివృద్ధికి త్వరలో ఒక ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల్లో ఒక్క రూపాయి లేకుండా ఖాళీ చేయడంతో ఇప్పటికిప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నామన్నారు. రాష్ట్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లించకుండా రూ.1600 కోట్లు బకాయి పెట్టారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.9 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి..కేవలం బటన్ నొక్కింది రూ.2 లక్షల కోట్లు పైచిలుకు మాత్రమే అన్నారు. కేవలం 2 లక్షల కోట్ల రూపాయలకు మాత్రమే ఖర్చు చూపించారన్నారు. మద్యం డబ్బంతా ఏం చేశారో తెలియదన్నారు. ఈ విధంగా రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టేశారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్లే ప్రతి బస్సు కొవ్వూరు డిపోకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నా రు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని,బోడపాటి ముత్యాలరావు,దేగల రాము, గంగుమళ్ళ స్వామి, ఎం.వెంకటేశ్వరరావు,బాబ్జి, కొప్పాక విజయకుమార్ పాల్గొన్నారు.

1న ఇంటికే పింఛన్లు

- పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
- రెండు రోజులే గడువు
- ఖాతాలకు చేరిన సొమ్ము

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జగన్ అసాధ్యం అన్నారు.. అయితే చంద్రబాబు మాత్రం సుసాధ్యం అని చేసి చూపించారు. గత నెలలో కేవలం రెండు రోజుల్లో ఇంటి వద్దనే పింఛన్లు అందించారు. ఈ నెలా అదే విధానాన్ని పాటించనున్నారు. జిల్లాలో ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదార్లకు ఇంటివద్దనే పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వృద్ధులు,వితంతులకు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల వంతున పింఛన్లు పంపిణీ చేయనున్నారు. గత ఏప్రిల్ నుంచే పింఛన్ల సొమ్ము పెంపు అమలు చేయడం వల్ల జూలైలో ఒక్కొక్కరికి రూ.7 వేల వంతున పింఛన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన జూలైలో సచివాలయ ఉద్యోగులు చాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులో 90 శాతంపైనే పంపిణీ చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల చేత పంపిణీకి ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం 2,40,595 మంది పింఛనుదారులు ఉన్నారు.వీరికి రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 లబ్ధిని చేకూర్చడానికి ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. తొలిరోజునే 99 శాతం పింఛన్లు పూర్తి చేయాలని.. ఏదైనా టెక్నికల్ సమస్య వస్తే మరుసటి రోజే అందించాలని ఆదేశించారన్నారు.

రెండు రోజులే పంపిణీ చేయండి : కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో ఆగస్టు 1నే పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పింఛన్ల పంపిణీపై ఆమె శనివారం సమీక్షించారు. ఆగస్టు 1న అందరూ ఉదయం 5 గంటల ముందే పింఛన్ల పం పిణీ ఆరంభించాలన్నారు. మొదటి రోజు 99 శాతం పంపిణీ పూర్తి చేయాలి..సాంకేతిక సమస్యలు తలెత్తితే రెండో రోజు పంపిణీ చేయాలని ఆదేశించారు.తర్వాత ఇక పొడిగింపు లేదన్నారు. సచివాలయాల వారీగా పెన్షన్ మొత్తాలు ఇప్పటికే ఎంపీడీవోలు,కమిషనర్లకు పంపించామన్నారు. వీటిని 30న సెక్రటే రియట్ బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తారని.. బ్యాంక్ మేనేజర్లకు నగదు ఆవశ్య కత లేఖను 29వతేదీ నా టికే అందించాలన్నారు. 31వ తేదీన మొత్తం సొమ్మును విత్‌డ్రా చేసుకో వాలని చెప్పారు.2వ తేదీకి చెల్లింపులు పూర్తి చేయాల న్నారు.చెల్లించని మొత్తాన్ని రెండు రోజుల లోపు సెర్ప్‌కి తిరిగి చెల్లించాలన్నారు. చెల్లించని పింఛన్లన్నింటికీ కారణాలను ఆయా సంక్షేమ సహాయకులు 5వ తేదీలోపు తెలియజేయాలన్నారు. గతంలో ఉపయోగించిన సిబ్బందినే ఉపయోగించుకోవాలని చెప్పారు.గత నెలలో మా దిరిగానే పింఛను లబ్ధిదారులకు పింఛన్ బట్వాడా రశీదు ఇస్తారన్నారు.

పింఛను లబ్ధిదారులు వీరే..

మండలం	లబ్ధిదారులు	పింఛను సొమ్ము
అనపర్తి	10,410	4,35,31,000
బిక్కవోలు	10,725	4,43,77,500
చాగల్లు	9452	4,00,74,000
దేవరపల్లి	11099	4,70,98,000
గోకవరం	10633	4,57,39,500
గోపాలపురం	9197	3,88,61,000
కడియం	12049	5,13,96,000
కోరుకొండ	12413	5,46,84,000
కొవ్వూరు	10245	4,32,77,500
కొవ్వూరు(అ)	3992	1,73,02,500
నల్లజర్ల	11591	4,90,65,000
నిడదవోలు	10546	4,51,49,000
నిడదవోలు(అ)	4313	1,89,31,000
పెరవలి	10406	4,38,17,500
రాజమండ్రి(అ)	29214	12,56,11,000
రాజమండ్రి(రూ)	19752	8,50,05,500
రాజానగరం	15500	6,68,26,000
రంగంపేట	8970	3,79,17,500
సీతానగరం	16,686	4,88,54,000
తాళ్ళపూడి	7917	3,33,09,000
ఉండ్రాజవరం	10479	4,46,53,000



గోదావరికి ఈ రోడ్డుకి సుమారు 5 కిలో మీటర్ల దూరం ఉంటుంది.. అయితే గోదావరి పొంగిందా ఈ ఆవ కాలువ నిండి ఆ కాలనీల్లో రోడ్లన్నీ చెరువుల్లా మారిపోతాయి. మళ్లీ గోదారి తగ్గే వరకూ ఇంతే. ఇదెక్కడో మారుమూల కాదండోయ్.. రాజమహేంద్రవరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సావిత్రినగర్‌లో దుస్థితి ఇది..

రూ.2 కోట్లు కొట్టేసి.. పోలీసులకు చిక్కాడు

రాజమహేంద్రవరానికి భువనేశ్వరి

సిబ్బంది ఉన్నా.. సమస్యలు పట్టవా
కొవ్వూరు కౌన్సిల్‌లో నిలదీసిన సభ్యులు

8

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ తిలారి రవినాథ్ శనివారం జిల్లాకు విచ్చేసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు.
- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



గజ్జరం పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు, డీఈవో

అమ్మ పేరుతో మొక్క నాటండి : డీఈవో

తాళ్ళపూడి, జూలై 27 : అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పెంచాలని డీఈవో కె.వాసుదేవరావు పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తాళ్ళపూడి మండలం గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన ఎకో క్లబ్‌డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడానికి స్థలం లేకపోతే.. వీలున్న చోట మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కల పరిరక్షణ బాధ్యత విద్యార్థులదేనన్నారు. ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. క్లబ్‌లో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ఒక టీచరు కో ఆర్డినేటర్‌గా, ప్రైమరీ పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి పిల్లలు సభ్యులుగా, యూపి స్కూల్‌లో 5 నుంచి 8వ తరగతి విద్యార్థులు, ఉన్నత పాఠశాలల్లో 8,9 తరగతి పిల్లలు 20 నుంచి 50 మందికి తగ్గకుండా పిల్లలతో క్లబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాసరావు, ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి బాగుకు రూ.10 లక్షల విరాళం



కడియం, జూలై 27 : పుట్టిన ఊరుని.. కన్నతల్లిని మరవకూడద నేది పెద్దల మాట.. నేడు ఊరు దాటితే చాలు పుట్టిన ఊరు గురుతే ఉండడం లేదు. అటువంటిది తను పుట్టిన ఊరుకోసం ఏదో ఒకటి చేయాలనుకున్నాడు.. వాళ్లను..వీళ్లను సంప్రదించగా బడిలో చాలా సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు.. అంతే సమస్యలన్నీ తీరుస్తానని రంగంలోకి దిగారు. పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.10 లక్షలు ప్రకటించారు. పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. కడియం మండలం దుళ్ళ గ్రామానికి చెందిన యన్నమని లక్ష్మీనారాయణ (నర్సరీలక్ష్మీపతి) తన తల్లిదండ్రులు శ్రీరాములు-సావిత్రిల పేరిట తమ గ్రామంలో ఉన్న పాఠశాల అభివృద్ధికి రూ. 10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రహరీగోడ ఎత్తు చేయడం, పాఠశాల పేరు బోర్డును సిమెంట్ స్తంభాలతో పునః నిర్మాణం, కిచెన్‌షెడ్‌కు గోడల నిర్మాణం, బాలుర టాయిలెట్స్, బాలికల టాయలెట్స్ అభివృద్ధి, సైకిల్‌షెడ్ అభివృద్ధి, పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా మినీస్టేజ్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి,యన్నమని లక్ష్మీపతి, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి బాలాత్రిపుర సుందరిదేవి

కొవ్వూరు, జూలై 27: పిల్లలు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.బాలాత్రిపుర సుందరి దేవి అన్నారు. కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె విచ్చేసి మాట్లాడారు. చిన్నతనం నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించడానికి పట్టుదలతో ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీరాముల నాగమునీంద్ర, వీఆర్ వరప్రసాద్, వై.ప్రకాశరావు, ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు, వై.రమేష్‌బాబు పాల్గొన్నారు.

రైళ్ల హాల్ట్ కల్పించాలని పోస్టుకార్డు ఉద్యమం

కొవ్వూరు, జూలై 27: కొవ్వూరులో 2019 నాటి రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలని విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. రైల్వే పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థులు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు ఇంగ్లీషు, హిందీ భాషల్లో పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రద్దుచేసిన రైళ్ల హాల్ట్‌ల కారణంగా సుమారు 100 గ్రామాలకు పైగా ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్డుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నెల్సన్ ఆంటోని వలియవీడు, వీటీ విల్సన్‌రాజు, కొండపల్లి రత్నసాయి, చిలంకుర్తి బాబి, రమేష్, జగన్నాధరావు, కేవీ రమణ, వల్లూరి రవి, వైకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న తహశీల్దార్ వనజాక్షి

గోపాలపురం, జూలై 27: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పాక్షికంగా పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల వారికి ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందజేస్తోందని తహశీల్దార్ డి.వనజాక్షి అన్నారు. ఈ మేరకు ఇళ్లు కూలిన పలువురు బాధితులకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను ఆమె శనివారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తుఫాన్ల కారణంగా మండలంలో 13ఇళ్లు దెబ్బతిన్నాయని, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.5 వేలు, పూర్తిగా దెబ్బతిన్న ఇంటికి రూ.10 వేలు ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులు అందించామన్నారు. కార్యక్రమంలో డీటీ ఎస్.కృష్ణ, సివిల్ సప్లై డీటీ దివాకర్, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, కొడవటి చినవెంకటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



దేవరపల్లి హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న టీచర్లు,విద్యార్థులు

దేవరపల్లి, జూలై 27: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, వీవీ.అప్పారావు అన్నారు. దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్, మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామంలోని వీధుల్లో, ఇంటి వద్ద పాఠశాలల్లో మొక్కలు నాటడం పాటు వాటిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు శంకురుడు, రామారావు, ఎంవీ కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

దేవరపల్లి, జూలై 27: తల్లిదండ్రులను పూజించడం భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమని ప్రిన్సిపాల్ పి.పేరయ్యనాయుడు అన్నారు. దేవరపల్లిలోని భాష్యం స్కూల్లో శనివారం తల్లిదండ్రుల దినోత్సవం జరిగింది. తల్లిదండ్రులు పిల్లల ఉన్నతికి కృషి చేస్తున్నారని, వారిని ప్రతి విద్యార్థి గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లలు పాదపూజ చేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి ఆంజనేయులు, చాంప్స్ ప్రిన్సిపాల్ సబాన పాల్గొన్నారు.

ఢిల్లీలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు



ఢిల్లీ హజరత్ నిజాముద్దీన్ దర్గాలో చాదర్ సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

నల్లజర్ల, జూలై 27: టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమంగా అరెస్టయినప్పుడు లోకేశ్‌తో పాటు ఢిల్లీకి వెళ్లిన స్థానిక టీడీపీ నాయకులు యద్దనపూడి బ్రహ్మారాజు, ద్వారకాతిరుమల అధ్యక్షుడు లంక సత్యనారాయణ, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి.. చంద్రబాబు క్షేమంగా తిరిగి రావాలని, అక్రమ కేసులు తొలగిపోవాలని అక్కడున్న హజరత్ నిజాముద్దీన్ దర్గాలో మొక్కుకున్నారు. నాటి మొక్కును శుక్రవారం ఢిల్లీ వెళ్లిన వీరు శనివారం మొక్కు చెల్లించారు. దర్గాకు చాదర్ సమర్పించినట్టు చెప్పారు.

ఆడపిల్లను రక్షిద్దాం.. విద్యావంతులను చేద్దాం

'భేటీ బచావో-భేటీ పడావో'లో సీడీపీవో బాలాత్రిపుర సుందరి



తాళ్లపూడి: బల్లిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్ల, జూలై 27: ఆడపిల్లలను రక్షించి, విద్యావంతులను చేద్దామని సీడీపీవో బాలాత్రిపుర సుందరి అన్నారు. శనివారం దూబచర్లలో అమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుకుని విజ్ఞానవంతులవ్వాలని, బాలిక చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం అమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇవాంజలిన్, అశోక్.. బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హారతి, వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో జరిగిన కార్యక్రమంలో ఆడపిల్లలను బతికించాలని, వారిని బడికి పంపి చదివించడంపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పొడిగింపు

కొవ్వూరు, జూలై 27: ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రభుత్వం మెడికల్ రీయింబర్స్‌మెంటును 2025 మార్చి 31 వరకు పొడిగించిందని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు తెలిపారు. ఉద్యోగులకు ఆరోగ్య పథకంతో పాటు మెడికల్ రీయింబర్స్‌మెంటు పథకం అందుబాటులో ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ పింఛనుపై ఆలోచన చేయాలన్నారు.

సిబ్బంది ఉన్నా.. సమస్యలు పట్టవా!

- కొవ్వూరు మున్సిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి 11 ఎకరాలు : చిన్ని
- అభివృద్ధి పనులు సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టాలి : రమేష్
- కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోకపోతే నిరవధిక దీక్ష : బీజేపీ కౌన్సిలర్ మురళీకృష్ణ



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, జూలై 27: మున్సిపల్ సిబ్బందికి అదనంగా సచివాలయ కార్యదర్శులు వచ్చినా వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీల నిర్వహణ, తాగునీటి సరఫరా పర్యవేక్షించడం లేదని కౌన్సిలర్లు అన్నారు. శనివారం కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ దొండకుంట వుంత రోడ్డు వద్ద మున్సిపల్ హెడ్ వాటర్‌వర్క్సు స్థలంలో పంపు హౌస్ నిర్మాణం చేపట్టాలని కౌన్సిల్‌కు తీసుకువచ్చిన తీర్మానాన్ని ఆమోదించారు. కంఠమణి రమేష్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎక్కడ నిర్మాణం చేపడతారని అడిగిన ప్రశ్నకు చిన్నీ బదులులిస్తూ పశివేదల-నందమూరు జంక్షన్‌లో ఉన్న లేఅవుట్ 3లో ఖాళీగా ఉన్న 11 ఎకరాల్లో కాలేజీ నిర్మించాలని సూచించారు. మున్సిపాల్టీలోని పలు అభివృద్ధి పనులకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి రుడాకు పంపించామన్నారు. అలాగే వాటర్‌వర్క్సులో మరమ్మతుల శాశ్వత పరిష్కారానికి సుమారు రూ.10 లక్షలు వ్యయం అవుతుందన్నారు. అయితే అభివృద్ధి పనులు జనరల్ ఫండ్‌తో కాకుండా ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టాలని రమేష్ అన్నారు. బ్రిడ్జిపేటలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలన్నారు. పీహెచ్ వర్కర్లతో పాటు, నాన్ పీహెచ్ వర్కర్లకు ఒకేలా వేతనాలు పెంచాలని కమిషనర్‌కు సూచించారు. కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయన్నారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రతిరోజూ ఎమినిటీ సెక్రటరీలు వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ సేవలను అందజేయాలన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ కౌన్సిల్ ఏర్పడిన నాటినుంచి విద్యుత్ డ్రైవర్ల్ కోసం కౌన్సిల్ సమావేశాల్లో నిధులు మంజూరు చేస్తూనే ఉన్నాం. నాణ్యతలేని డ్రైవర్స్ కొనుగోలు చేస్తున్నామా, చాలా సందేహాలు ఉన్నాయని, విచారణ చేపట్టాలన్నారు. కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకష్ణ మాట్లాడుతూ గోష్పాదక్షేత్రంలో దేవతావృక్షం కొమ్మలు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదుచేసి 10 రోజులయిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కమిషనర్ కె.జోసఫ్ దానియేలు మాట్లాడుతూ గోష్పాక్షేత్రం ఇరిగేషన్ స్థలమని, మున్సిపల్ సిబ్బంది ఎవ్వరూ చెట్టు కొట్టడంలో పాల్గొనలేదని శానిటరి ఇన్‌స్పెక్టర్ విచారణలో తేలిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష చేస్తానని మురళీకృష్ణ అన్నారు. గౌతమీనగర్‌లోని లక్ష్మీసాయి డ్వాక్రా గ్రూపు రిజల్యూషన్‌లో ట్యాంపరింగ్‌కు పాల్పడిన రిసోర్స్‌పర్సన్ శ్రీలక్ష్మిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సూరపనేని చిన్ని మాట్లాడుతూ రిసోర్స్‌పర్సన్‌పై ఫిర్యాదులొచ్చి వచ్చినా 8 నెలలుగా ఏం చేస్తున్నారని మెప్మా సీఎంఎం భవానీని ప్రశ్నించారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించకుండా పాలకవర్గ సభ్యుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆగస్టు కౌన్సిల్‌కు పట్టణంలోని డ్వాక్రా ఆర్పీల రికార్డులు తనిఖీచేసి నివేదిక అందజేయాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధికి కృషి

- పట్టణంలో అపరిష్కృత సమస్యలు పరిష్కరిద్దాం
- అధికారులు అలసత్వం, పక్షపాతం లేకుండా పనిచేయాలి
- నిడదవోలు కౌన్సిల్ సమావేశంలో మంత్రి దుర్గేష్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 27: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో అభివృద్ధికి పెద్దపీట వేద్దామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలులోని మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆయన ఎక్స్ అఫీషియో మెంబర్‌గా విచ్చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లతో చర్చించి నిధులు సమీకరించి పట్టణంలో రహదార్లు, డ్రైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులంతా కలసికట్టుగా పనిచేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళదామన్నారు. అధికారులు గత ప్రభుత్వ ఆలోచనలు మార్పు చేసుకుని పని చేయాలని, అలసత్వం వహించకుండా పక్షపాతం లేకుండా పనిచేయాలన్నారు. పలువురు కౌన్సిలర్లు పట్టణంలో పలు సమస్యలపై మాట్లాడగా కలసికట్టుగా పట్టణంలోని అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పలువురు కౌన్సిలర్లు, కమిషనర్ రామ్‌గోపాల్‌రెడ్డి, ఏఈ మాధవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంపై ఎన్నాళ్లకో..

ఇదిలా ఉండగా.. నిడదవోలులోని 1వ వార్డు నుంచి వైసీపీ తరుపున గోపిరెడ్డి శ్రీనివాస్ 2021లో కౌన్సిలర్‌గా ఎన్నికైన తర్వాత తన వార్డులోని టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన క్రీడా వికాస కేంద్రం (ఇండోర్ స్టేడియం) వైసీపీ ప్రభుత్వంలో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. నేటికీ అతీగతీ లేదు. శ్రీనివాస్ కౌన్సిల్ సమావేశంలో ఇండోర్ స్టేడియంపై చర్చించడం గాని, చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడం గాని, వారిని అక్కడికి తీసుకెళ్లి చూపించడం గాని చేయలేదు. అలాంటిది శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని కోరడం దెయ్యాలు వేదాలు వల్లిచడంలా ఉందంటూ కొందరు సొంత పార్టీ కౌన్సిలర్లే గుసగుసలాడడం విశేషం.

వ్యసనాలకు బానిసై రూ.2.20 కోట్లు కొట్టేశాడు

- రూ.2.20 కోట్లు కోట్టేయడానికి ఉద్యోగి యత్నం
- వారం నుంచి స్కెచ్ వేస్తున్న నిందితుడు
- నగదు తీసుకుని అద్దెకారులో పరారీ
- 12 గంటల్లో పట్టుకున్న పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కిశోర్

రాజమహేంద్రవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏటీఎంలలో ఉంచాల్సిన డబ్బులతో ఉడాయించాలనుకున్న ఉద్యోగి ఆటకట్టించిన పోలీసులు 12గంటల్లో కటకటాల్లోకి నెట్టారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన వాసంశెట్టి అశోక్‌కుమార్ బ్యాంకు ఏటీఎంలలో డబ్బులు నింపే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో 2018 నుంచి నెలకు రూ.11 వేల జీతానికి సార్టర్ అసిస్టెంట్‌గా పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నాడు. ఈ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలలో డబ్బులు నింపుతుంది. ఈ నెల 26న(శుక్రవారం) మధ్యాహ్నం సమయంలో ఏటీఎంలలో పెట్టేందుకు బ్యాంకు నుంచి రూ.3 కోట్ల 32 లక్షల 50 వేలు తీసుకున్నాడు. రూ.1కోటి 12 లక్షలను మరో ఉద్యోగి హరీశ్ గౌడ్, ఆదిత్య రూట్ ఆఫీసర్ దొంతల సునీల్ కుమార్(ఫిర్యాదీ)లకు ఇచ్చాడు. మిగతా సొమ్ము రూ.2 కోట్ల 20 లక్షల 50 వేలను వారం కిందట నుంచి వేసుకున్న పథకం ప్రకారం తాను అద్దెకు తెచ్చుకున్న కారులో పెట్టుకొని ఉడాయించాడు. దీనిపై మధ్యాహ్నం 3గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తుండగా రాజానగరం మండలం చక్రద్వారబంధం సమీపంలో శనివారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా కారులో వెళ్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా కారులో రూ.1 లక్ష ఉందని, అతడిని నిందితుడు అశోక్‌కుమార్‌గా గుర్తించినట్టు ఎస్పీ వివరించారు. అశోక్ ఇచ్చిన సమాచారంతో అదే గ్రామంలో అతడు అద్దెకు తీసుకున్న రావీ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లోని గంగా బ్లాక్‌లోని ఫ్లాట్ నెం.104లో దోపిడీ డబ్బును దాచి ఆ రూ.లక్ష మాత్రం తీసుకొని కొంతకాలం కనబడకుండా పరారీలో ఉందామని నిందితుడు చెప్పినట్టు పేర్కొన్నారు. దీంతో ఆ ఫ్లాట్‌లో దాచిన రూ.2,19,50,000ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు చెడు వ్యవసనాలకు, విలాస జీవనానికి అలవాటుపడి ఈ నేరానికి పాల్పడినట్టు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఉన్నతాధికారుల సూచనలతో సాంకేతికత సహాయంతో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని అనుసరించి నిందితుడిని కేవలం 12గంటల్లో అరెస్టు చేశామన్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ విజయపాల్, త్రీటౌన్ (వన్‌టౌన్ ఇన్‌చార్జి) సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- ధవళేశ్వరం వద్ద 14అడుగులకు గోదావరి నీటి మట్టం
- 13.20లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి



కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న గోదావరి

ధవళేశ్వరం, జూలై 27: తొమ్మిది రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ఉపనదుల నుంచి వస్తున్న వరద నీరు తోడవడంతో ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. సీజన్లో మొదటిసారిగా భద్రాచలం వద్ద 53అడుగులకు పైబడి ప్రవహిస్తుండగా ధవళేశ్వరం వద్ద 14అడుగులకు చేరుకుని ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు స్వల్పంగా తగ్గిన నీటి మట్టం 13.40 అడుగులకు చేరుకుంది. అటుపై ఎగువ నుంచి వచ్చే వరదనీటితో నీటి మట్టం పెరగడం ప్రారంభించి మధ్యాహ్నం 3గంటలకు 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 13లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. ఆపై నీటి మట్టం మరింత పెరుగుతూ రాత్రి 7గంటలకు 14అడుగులకు చేరుకోగా 13,20,274క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 15 అడుగులకు పైగా పెరిగి ఆపై తగ్గవచ్చిని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా పెరిగిన నీటి మట్టం ప్రమాదకర స్థాయి 53అడుగులు దాటి రాత్రి 7గంటలకు 53.60అడుగులకు చేరింది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి 1.20లక్షలకు పైగా నీటిని విడుదల చేస్తుండడంతో ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద ప్రస్తుతం నీటి మట్టం పెరుగుతోంది.

ఎగువన నీటి మట్టాలు

శనివారం సాయంత్రానికి ఎగువన కాళేశ్వరం వద్ద 9.47మీటర్లుగా నీటి మట్టం నమోదు కాగా, పేరూరు వద్ద 16.80మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.59మీటర్లు, భద్రాచలం 53.40అడుగులు, కూనవరం వద్ద 21.48మీటర్లు, కుంట వద్ద 13.15మీటర్లు, పోలవరం వద్ద 13.26మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.08మీటర్లుగా నీటి మట్టం నమోదయింది.

అంతటా అప్రమత్తత

ధవళేశ్వరం వద్ద గోదావరికి శనివారం మధ్యాహ్నం 3గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటి మట్టం 13.75 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు ప్రమాద హెచ్చరిక జారీ చేస్తూ ఫ్లడ్ సెక్షన్ అధికారులు వారికి కేటాయించిన ఏటిగట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈఈలు, డీఈలు, ఏఈలు, ఫ్లడ్ సూపరింటెండెంట్, ఫ్లడ్ సెక్షన్ ఆఫీసర్లుగా వారి వారి పరిధిలో విధులు చేపట్టారు. బలహీన ఏటిగట్ల వద్ద, ఔట్‌పాల్స్ స్లూయిజ్‌లు వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు.

మొక్కలు, పుస్తకాల పంపిణీ



ఉండ్రాజవరం, జూలై 27: మండలంలోని మోర్త నెం.2, తాడిపర్రు నెం.2 పాఠశాలల విద్యార్థులకు తణుకు-పైడిపర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో పూల మొక్కలు నాటారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పండ్లు, కూరగాయల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు ఉందుర్తి ప్రసన్నకుమార్, కుంకట్ల వెంకటరత్నం, బాబూజీ, గోవింద్, ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యాయురాలు కె.టీబీలక్ష్మి, స్థానికులు సిర్రా కార్తీక్, మందపల్లి రాకేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఉండ్రాజవరం, జూలై 27: ఉండ్రాజవరంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా స్థానిక అరుంధీపేటలో దోమలు పెరుగుదల, వాటి నివారణ మార్గాలపై వైద్యసిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో ఉండే కుండీలు, టైర్లలో నీరు ఉండడం వల్ల దోమలు పెరిగి డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమవుతాయని మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఈగలు వాలకుండా ఆహారపదార్థాలపై మూతలు ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు జి.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ వర్ధంతి

ఉండ్రాజవరం, జూలై 27: ఉండ్రాజవరం శాఖాగ్రంథాలయంలో శనివారం ఏపీజే అబ్దుల్ కలామ్ 9వ వర్ధంతిని నిర్వహించారు. కలామ్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, లైబ్రేరియన్ జి.కృష్ణారావు, దినేష్, ప్రవీణ్, శివరామ్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



రామకృష్ణనగర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, డాక్టర్ గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూలై 27: మండలంలోని హుక్కుంపేట పంచాయతీ పరిధిలోని రామకృష్ణనగర్ పరిసర ప్రాంతాల్లో కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజ్ఞప్తి మేరకు ఆమె శనివారం టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్ గోరంట్ల, పలువురు అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చేపట్టాల్సిన తక్షణ చర్యలపై పలు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, టీడీపీ మండలాధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నీరుకొండ



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న నీరుకొండ

కోరుకొండ, జూలై 27: జిల్లా కలెక్టర్ ప్రశాంతిని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బూరుగుపూడి ఆవభూముల సమస్యలు వివరించి వరద బాధిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది వరదలకు బురద కాలువ పొంగడం వల్ల సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన కొన్ని గ్రామాలు ఇబ్బందులకు గురవుతున్నాయని, వేలాది ఎకరాల్లో పంట నష్టపోతుందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు.

ఎమ్మెల్యే గోరంట్ల పీఏగా డీటీ నాగేంద్రబాబు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 27: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారిక పీఏగా ఆర్‌ఎస్‌వీ నాగేంద్రబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం నాగేంద్రబాబు గోరంట్లను కలిసి బాధ్యతలు స్వీకరించారు. నాగేంద్రబాబు డిప్యూటీ తహశీల్దార్(డీటీ)గా పనిచేస్తూ ఎమ్మెల్యే పీఏగా నియమితులయ్యారు.

రాజమహేంద్రవరం వచ్చిన భువనేశ్వరి



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందించిన ఎమ్మెల్యే వాసు, ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి హాజరయ్యారు.షెల్టాన్ అధినేత సుధాకర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. భువనేశ్వరిని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన అల్లుడు అన్నె రామకృష్ణ కుమార్తె అన్నె స్మిత, పలువురు టీడీపీ నేతలు భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు.పుష్పగుచ్ఛాలు అందించి ఆప్యాయంగా పలకరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం, జూలై 27: గోదావరి వరదల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. శనివారం వారి ద్దరూ మండలంలోని ములకల్లంక, బొబ్బిల్లంక, జాలిమూడి గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను, బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వలవల రాజా, పోలిన కృష్ణ, పెండ్యాల అవిస్వామి, చిట్టూరి రంగారావు, మట్ట వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి)	ప్రభుత్వ జూనియర్ కళాశాల
అనన్య	భారతీయుడు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	డెడ్‌పూల్
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	కల్కి

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భారతీయుడు-2
స్క్రీన్ 2	కల్కి
శ్రీనివాస	---